# "కావలసిన సంబంధం."

★ రచన: పురాణం సుబ్రహ్మణ్యశర్మ ★

మంచి - చెడ్డా అన్న విచక్షణా జ్ఞానము వివేకము లేకుండా ఏ పనిచేస్తే ఒకవిధమైన ఆనందము తృప్తి లభించి తేలిగ్గా మనస్సుకు ఆహ్లాదాన్ని కూరుస్తుందో - అటువంటి కార్యకమాల్లోనే విరివిగా పాల్గొంటూ. ఎక్కువగా అటువంటి క్షణికోల్లాసముల కోసమే జీవితాన్ని వ్యర్ధపరుస్తూ నలుగురిలోనూ 'పెద్దమనిషి - మంచివాడిని'— అనిపించుకోకుండా పట్టభద్రుడ్నయ్యే వరకుకూడా నిర్బాధ్యతాయుతమైన జీవితాన్నే గడుపుతూ వచ్చాను

ఈ యిరవయ్యొకటో మైలు రాయిని సమీపించేవరకు నేనే బాధ్యతల బరువును నెత్తిన వేసుకోలేదు అఖరికి నవీనులకు మల్లే ప్రయాణాల్లో చిన్న తోలుసంచీ ఒక తువ్వాలు రెండు మూడు చేరుమాళ్లు ఒక జత దుస్తులు అద్దం దువ్వెన సబ్బు బిళ్ళలన్నా వేసుగోకుండా చెప్పవలసివస్తే కట్టుకున్న పంచె, తొడుక్కున్న చొక్కా పైమీద ఉత్తరీయం తోటే బయలుదేరినట్టుగా సాగించదలచాను నా ప్రయాణాన్ని.

నేను మొయ్యలేని లగేజీ నా కంటకట్టి తాము ఆనందించాలని చూసే పెద్దవాళ్ళ పెళ్ళి పన్నాగాలకు లొంగలేదు నేను, పెళ్ళివద్దు అనిపట్టుపట్టి మూర్ఖుడ్ననిపించుకున్నాను మొన్నటి వరకూ

ఇంత యెందుకు వెనకటి మా వూళ్ళో తిమ్మక్క వారింటిలో పెళ్ళితో మేజువాణీ కట్టిన భోగం పిల్లను నన్ను నవ్విస్తానని పది రూపాయలకు ప్రయత్నించి అఖరికి పందెమోడి నాకు పది రూపాయలు సమర్పించుకున్నారు. తెల్లవార్లు వాళ్లు పలకరిస్తూనేవున్నారు. ఆఖరికి వచ్చి శృంగారము వెలిగిస్తూనేవున్నారు. నన్ను అడ్డమైన కుంటి గ్రుడ్డి ప్రశ్నలు వేస్తూనే వున్నారు. అన్నిటికీ సమాధానం చెబుతూనేవున్నాను. కాని నవ్వలేదు. నేను వాళ్ళను ఓడించాను.

నా మేనమామ నేను తను తీగల తంపరగా కని పారేసిన పుత్రికా రత్నరాసినుండి ఒక్క రత్నాన్నన్నా పరిగ్రహించకపోతానా! అన్న ఆశతో నాకు రెండు మాట్లు క్రొత్త సరిగంచు పంచలు పెట్టి అప్పుడప్పుడు పాతికా పరకా పంపుతూ మనియార్డరు కూపనులో 'జాగ్రత్తగా చదువుకోవలసినది - శలవులకు తప్పకుండా వచ్చి పిల్లలతో నాలుగు రోజులపాటు వుండవలసినది' అని రాస్తూవచ్చాడు

అందుకొ తనకు కృతజ్ఞతాసూచకముగా ఒక్క ముక్కానీ కార్డుకూడా వ్రాయలేదు. చివరకు విసిగి ఓమాటు ఏదో పనిమీద వచ్చినట్టు ఆయనే వెంటబెట్టుకొచ్చాడు తన పుత్రికా రత్నాన్ని. నా లాడ్జినిండా చిత్తు కాగితాలు దుమ్ము ధూళి - సిగరెట్టు పీకలు అగ్గిపుల్లలు వీటితో నిండి నానా అసహ్యంగా వుంది చూడ్డానికి. వీళ్ళిద్దరూ రావటంవల్ల నా మిత్రుడు నా గది కాళీచేసి ప్రక్క గదుల్లోకి పోయి సర్దుకున్నారు.

అక్కడుంచి మా మేనమామ - 'చూడమ్మా బావకు పుస్తకాలు సర్దిపెట్టు నేను వూళ్ళో పని చూసుకొని వచ్చేలోగా యీ బావలు అన్నీ దులిపి

బావ గది శుభ్రం చెయ్యి. ఆ కూజాతో పంపు దగ్గర్నుంచి నీళ్లు తెచ్చి గాజు గ్లాసులు రెండూ తోలచి ఆ మూలవుంచు' అని ఒక్కటొక్కటే పురమాయించి వెళ్ళిపోయాడు.

ఆ పిల్ల భయపడుతూ భయపడుతూ పోయి తలుపుమూలనుంచుని కిటికీలోంచిరోడ్డుమీదపోయే బస్సుల్ని జట్కాల్ని మనుష్యుల్ని విచిత్రంగా చూస్తూ ఆనందిస్తూన్నది. నేను లేచి యీ అతిధుల్ని గూర్చి మనస్సులో ఆశ్చర్యపడుతు పుస్తకాలన్నీ చుట్టి బల్లమీదవుంచి మడతమంచంమీద వాల్చివున్న పక్కను చుట్టుగుంటూ యింకా ఏమి జరుగుతుందోనని వూహిస్తూ నాలో నేను నవ్వుకున్నాను.

నా మేనమామ కూతురు చాపమీద పడివున్న పాత హిందూ పత్రికమీది సినిమా ప్రకటనను ఆశ్చర్యంతో పరీక్షిస్తూ నేను పక్క చుట్టుగోవటం చూసి - అపక్క నేను చుడతాను. ఇంకా నేనేదన్నా చెయ్యాలసిన పనివుంటే చెప్పు'అని నాలుక చప్పరించుకుని కాదు కాదు చెప్పండి' అంది.

'నువ్వెక్కడ చాపలు పక్కలు చుట్టడానికి నీళ్లు తేవడానికి చాకిరీ చెయ్యటానికి వచ్చావా ?" అన్నాను నేను. నా ప్రశ్నను ముట్టుగోకుండా - 'నాన్న తనవెంట రమ్మని నన్ను తీసుకొచ్చాడిక్కడకు నా కేం తెలియదు, మీరు చెప్పిన పని చేస్తాను' అంది జాలిగొలిపే దీనమైన గొంతుకతో. నేను సానుభూతాత్మకంగా నవ్వి - 'మీ నాన్న ఎక్కడకు రమ్మంటే అక్కడకు వెళ్తావన్న మాట. ఎవళ్ళకు చాకిరీ చెయ్యమంటే వాళ్ళకు చేస్తావన్న మాట. అవునా? నేను వేసిన ప్రశ్న ఆ పిల్లకు కష్టంగానే వున్నప్పటికీ-

ఇష్టమైనచోట చేస్తాను - అంది భయపడుతూ ఇష్టమైన చోటంటే నేనడిగిన ప్రశ్నకు ప్రత్యుత్తరంగా నవ్వి - వెంటనే జాలిగొలిపేలా కళ్ళతో ఏదో సమాధానాన్నివ్వటానికి ప్రయత్నించినట్లుగా కనుపాపలను కదల్చి చేత్తో తన పరికిణీ ముందు కుచ్చెళ్ళను కొద్దిగా ఎత్తి పట్టుకుని తలకాయవంచి నమ్రతతో కొద్దిగా అనమ్ర భావాన్ని చిల్చుకొని ఉబికి వస్తూన్న అభిమానంతో 'ఎవళ్ళకిపడితే వాళ్లకెందుకుచేస్తాను? అంది. నేను నా పక్కను తీసి పెట్టిమీదవుంచి మడత మంచాన్ని ఎత్తి గదిని విశాలంగా వుంచాలనే కోరికతో అన్ని చిందరవందగా పడివున్న సామానులను తీస్తూ యింకా ఏమీ పాలుపోక నిలబడిపోయిన ఆ మేనమామ కూతుర్ని

'సరే ! నువ్వు ఎవళ్ళకిపడితే వాళ్ళకు చెయ్యవుగా ఐతేమరి నే నెవర్ని ?'

'మీరెవరా - నాకు తెలుసు - ఐనా యిదేంకంటి ప్రశ్న ? అన్నట్లుగా చూసింది రత్నం నేను పలకరిస్తే సమాధానం చెప్పే ధైర్యం వున్నదిగదా యీ పిల్లకు అనే వుద్దేశంతో "పరవాలేదు" అని పైకి అప్రయత్నంగా గొణిగాను. సరిగా అదే సమయానికి రత్నం తలుపువారనున్న మంచినీళ్ళ గ్లాసును పడదోసి అందుకు నేను పరవాలేదన్నానేమో అనుకొని నాకేసి చూసింది.

'మీ నాన్న ఎప్పటికి వస్తాడు - అతనికింకా యీ వూళ్లో ఎక్కడన్నా పనివుందా? అతనెక్కడికి వెళ్తున్నాడో నాతో చెప్పి వెళ్ళలేదు. అందుకని అడిగాను.

'దుర్గ గుడికి వెళ్ళి మొక్కుకుని రావాలి - అదేపని'

అందులో కొంత విషయాన్ని క్లుప్తీకరించింది తెలివిగా నేను మళ్లీ ప్రశ్నవేశాను - అసలు రహస్యం బైట పెట్టిద్దామని.

'మొక్కు ఎవరికి ?'

రత్నం యీ ముక్క కూడా నా నోట అనిపించాలనా అనుకున్నట్లుంది మనస్సులో - 'ఇంకెవరికి - నాకే -' అంది సిగ్గుతో - నేను వదల్లేను "ఎందుకోసం... " ఆమె చెక్కిళ్లు ఎర్రబడ్డాయి. మరో పిల్లఅయి రత్నంగాకపోయినట్లయినా

యీపాటికి తుర్రుమని పారిపొయ్యేది - "ఎందుకోసమంటే? అంది నేనేదో మరీ చిలిపి ప్రశ్న వేసినట్లుగా ఫీలయి నేను బయటకుపోయి కాఫీ హోటలువాడితో కాఫీ ఉపాహారాలు పంపమని చెప్పి గదిలోకివచ్చాను మడత మంచంమీద కూర్చుని సినిమా బొమ్మలున్న పుస్తకం దీక్షగా చదువుతూన ది లేచి మన్నన చేయబోయింది 'నన్నెందుకు మన్ననచేస్తావు. నేనెవర్ని? అన్నా మళ్లీ "నేనెవర్నంటారేమిటి? మీరెవరో ఐతే మీ యింటి కెందుకొస్తాము—"

పిట్ట కొంచెం కూత బట్టిందనుకున్నా మనస్సులో. పైకి - "ఇది మా యిల్లు కాదుగా- అంటూండగా కుర్రాడు కాఫీలు ఉపహారాలు తెచ్చి బల్లమీద వుంచాడు.

రత్నం మళ్లీ నవ్వి "ఎందుకివన్నీ తెప్పించారు? ఇప్పుడేగా దుర్గగుడికి వెళ్లాలని మీతో చెప్పింది"

"ఏం కాఫీ ఉపహారాలు సేవించిపోకూడదా మీరు నిన్నల్లాచేసిన ప్రయాణపు బడలిక తీర్చుకోకుండా గుడికెళ్ళి ఎట్లా మొక్కుకుంటారు?"

"ఏం ఎందుకు మొక్కుకోలేము? అసలు ఎక్కడఅయినా కాఫీలు ఉప్మాలు తిని దేవుడి దర్శనం చేసుకుంటారేమిటి?

"దేవుడుకాదు మీరుమొక్కుకునేది దేవతగా"

"సరే ఏదోఒకటి"

నేనుకాఫీని గ్లాసులో పోసుకొని ఊదుకొని తాగుతూ-

"దేవికైనా పెట్టిపుట్టాలి తినేందుకైనా దంతసిరి వుండొద్దూ "

"పోన్లెండి. అద్దం దువ్వెన్న ఓ మాటు యిస్తారు?"

నేనులేచి అలమార్లో పై అరనంతా ఆక్రమించుకున్న బెల్జియం అద్దం సెల్లూలాయిడు దువ్వెన షాంపు వాసన నూనె బ్రిలియంటైన్ వ్యాసులైన్ కూటికూర పవుడరుడబ్బా, లవండరుసోపు అన్నీ ఒకొక్కొక్కటిగా తెచ్చి ఆమె ఎదుట వుంచాను. రత్నం షాపులావగ్గివున్న ఆ టాయిలెట్ ద్రవ్యాలను చూసి నిస్తుబోతూ-

'ఇవన్నీ మీవే- యిన్ని 'మీ కెందుకండీ?' అంది

"అవ్వే నాకోసం కొన్నానా - అప్పుడప్పుడు వచ్చే నీవంటి తిథులకోసం కూడా -' అనినవ్వాను

"ఇన్నెందుకు - అసబ్బుబిళ్ళ పవుడరు తప్ప మరేమీ వద్దు- ఐనా వాటిని రాసుకోవటం నాకు తెలుస్తేగా-"

"పోనీ నేను చెబుతానుగా వాటి ఉపయోగం"

రత్నంచురుక్కున నాకేసిచూసి - "చెపుతారా చెప్పనక్కరలేదులెండి' అంది ఎలక్ట్రిక్‌షాకుతిన్నదానికి మల్లేఅయి.

"అయ్యో! మరి వీటి ఉపయోగం నీకు తెలియకపోతే నేను చెప్పినా తెలుసుకోకపోతే నీకు రేపెవరు నేర్పుతారు? కనుక మర్యాదగా విని నేను చెప్పినట్లుచెయ్యి ఇవ్వాళ్టికి. అవునా?"

రత్నంవెళ్ళి మొహం రుద్దుకుని వచ్చింది. ఆమె వచ్చేసరికి నేను యిస్త్రీతువ్వాలు చేతబుచ్చుకుని గుమ్మం దగ్గర నుంచొని రాగానే అందిచ్చి పక్కకు తప్పుకున్నాను.

"మరీ యింత మర్యాద పనికిరాదండి' అంది అద్దంఎదుట కురులు దిద్దుకుంటూ-

నేను స్నో సీసా ముందుకుతోసి పక్కనుంచి అట్లా రత్నంముఖాన్ని అద్దంలో చూస్తూ నిలబడిపోయాను- స్నో రాసుకుంది. ఆ పరిమళం నా గదిలో నిండుగా అలుముకుంటోంది. అంతకుముందల్లుకున్న జడకు రిబ్బను ముడినివేసి వ్రేలితో సరిదిద్దుతూ అద్దంలో తనఅందాన్ని అభివృద్ధి చేసుకుంటోంది. ఈ అలంకరణము సహజంగా కలిగివున్న అందానికి అభివృద్ధినిస్తుందా. మెరుగులు దిద్దుతుందా అన్న ఆలోచనలో పడిపోయి చూస్తూండగా 'మీరు కొంచెం అవతలికి వెళ్తారా అంది రత్నం.

ఇదేమిటి? తిన్నయింటి వాసాలు లెక్కబెట్టినట్లు యిట్లా బయటికి దయచేయ మంటోందే

మిటా యీపిల్ల అనుకుని ఆమెచేతిలోని ఆరు గజాలచీరను తెల్లటిలేసు పరికిణీని చూసి పక్కకు తప్పుకున్నాను. వీధిలోకొచ్చిన తర్వాత ఒక సిగరెట్టు కాల్చుకోవలసినదని మనస్సు ఆజ్ఞాపించింది. మళ్ళీ కిటికీ దగ్గరకువెళ్ళి "ఇదుగో చూడురత్నం నాజేబులో అగ్గిపెట్టి సిగరెట్టుపెట్టి వుంటుంది అది యిల్లాయియ్యికొంచెం నీకు పుణ్యముంటుంది" అన్నా అవతల్నుంచి- "కొంచెంసేపు ఆగండి" అని ఉత్తరువు.

"అబ్బేవీల్లేదు" అని యిక్కడ్నుంచి సమాధానం,

"అయ్యో! కొంచెంసేపు ఆగాలిమరి "అని పునః విజ్ఞప్తి.

అబ్బే ఒక్కక్షణంకూడా ఆగలేను ఆచేతి సంచీ యివతల పారెయ్ కాల్చుకుంటూ కూర్చుంటాను."

కిటికీలోంచి రత్నం చెయ్యియివతలకు వచ్చి నాచేతికి చేతిసంచీ నందచేసి వెనక్కు వెళ్ళిపోయింది. అట్లా నేను వరండాలో కూర్చుని అరపెట్టె సిగరెట్లు తగలేసాను ఆమె చీరకట్టుకోవడంలో పవిముస్తాబు పూర్తికాలేదు. ఈరస కందాయప్పట్టులో మామయ్య గుర్రబ్బండీతో సహాలంఘించు కొచ్చాడు.

"ఏంరా బయట కూర్చున్నావు?" అని గుటకలు మ్రింగుతూ తను గదిలోలేని సమయాన మేము తగులాడుకుని గిల్లుకుని ఒకరినొకరు పీక్కుని వీధిలో పడ్డారేమో అనుకున్నట్టుగా. "అది ఏమైంది?" అని వెంటనే అడిగాడు.

నేను నవ్వకుండా "లోపలుంది" అనిమట్టుకు చెప్పాను.

'అమ్మాయీ!' అని తలుపు తట్టబోయాడు,

"కాస్సేపు ఆగునాన్నా బట్టగట్టుకుంటూన్నా" నంది. ఆ చేతిసంచీ యీడ్చుకుంటూ నాప్రక్కనొచ్చి చతికిల బడ్డాడు. గుర్రపుబండివాడు వచ్చి గడ్డి సర్దుకుంటున్నాడు బిచాణాఎత్తి. గుర్రం ముందుకాలు యీడిస్తూ గట్టిగా ఒకటిరెండుసార్లు సకిలించింది.

ఈ బండీ దేనికి అన్నా. దుర్గగుడికి అన్నాడు.

"మొక్కుగిక్కు ఏమన్నావుందా"

"వుందిలే" అన్నాడాయన వీడికివన్నీ ఎట్లా తెలిసినయ్యా అని సందేహిస్తూ. ఇట్లామేం ఆ కబుర్లు, యీ కబుర్లు చెప్పుకుంటూ పావుగంట గడిపేసాము, ఆయనకు విసుగెత్తింది, "అమ్మాయీ!" అని కొంచెం స్వరంపెద్దది చేశాడు. "ఉండునాన్నా', అని లోపల్నుంచి సమాధానం మామయ్యకి చిరాకెత్తింది. "ఇంతసేపు ఆలోపల ఏంచేస్తున్నట్లు?" అని నాకేసి గుడ్లు పెద్దవిచేస్తూ అన్నాడు.

"నాకుమట్టుకేం తెలుసు" అని నేనూ ఇవతలే ఉన్నాగా అనుకున్నా లోలోపల.

తలుపు ఫెదేల్మని తెరుచుకుంది, "ఇంతసేపు శివరాత్రి జాగారం చేయించావేమిటే అమ్మాయి" అన్నాడాయన అయిందా సింగారం అన్నట్లు చూసాను, 'ఆఁ' అన్నట్లు తలవూపింది. మా కళ్ళు లోకానికి తెలియని భాషలో మాట్లాడుకొన్నాయి, గుర్రం సకిలించింది, బండివాడు తొందరపెడ్తూ ఏదో గొణుగుతున్నాడు. మామయ్య కండువా మెడచుట్టూ తిప్పి వేసుకుంటూ 'యిదిగో యివిరెండు కొబ్బరికాయలు - అది పసుపు పొట్లం యిది కుంకుమ పొట్లం అది హారతి కర్పూరపుబిళ్ళ, ఈ చిల్లరకాస్త దగ్గర వుంచుకో పద. అబ్బాయి గదికి తాళం వేసిరా, నువ్వుకూడా రావు గుడికి? అన్నాడు నాకేసితిరిగి,

'అబ్బే! నాకేమీ మొక్కులు లేవుగా!' అన్నా. రత్నం కిటకీలోంచి రోడ్డుమీదకుచూస్తూ పవిట చెంగు నోటికడ్డం బెట్టుకుని వాళ్ళనాన్నకు తెలియకుండా నవ్వింది,

"ఏమిటి? వస్తావా? రావా?" అనితొందరపెడుతూ మావయ్య యింకా నుంచుంటావేం పద"అని కూతుర్ని తొందరగా నడవమని నాకేసి తిరిగి "నువ్వుకూడావస్తే బావుంటుందని ఆఖరిసారిగా చెప్పాడు. వాళ్ళ నాన్న నావైపుకు తిరిగినప్పుడు రత్నం కళ్ళతో మాట్లా

డింది. "మీరు తప్పకుండా రావాలిసుమా అన్నట్టుగా. నేను గదికి తాళంవేసి బండిలో కూర్చున్నాను. రత్నం షాంపూ నూనె, నా పాండ్స్ క్రీము, వాసనగొడ్తుంది. తనకూతురిన్ని వింత వాసనల నెట్లా విరజిమ్ముతున్నదో తెలుసుకోలేక అయోమయావస్థలో పడ్డాడు మామయ్య. బండిలో కూర్చున్నంతసేపు రత్నం మ్యునిసిపల్‌మార్కెటు. దుకాణాలు. కాఫీహోటళ్ళను ఉత్సాహంతో చూస్తోంది ఆ గోపురం చాలా పెంకెది కావటం కూడా ఓ కారణం: కాగా బండికుదుపులో రత్నం ఖాంపుహైరాయిలు వాసన లవండరు పరిమళము కూటికూర మెరుగుల్లోని సన్నటి వాసన గుమాయించి బండి అంతా కలయ దిరిగి ముక్కురంధ్రాలవద్ద బ్రహ్మాండమైన ముట్టడిని సాగిస్తున్నాయి. మావయ్య దగ్గగుడి మెట్లెక్కేసరికి అలసిపోయాడు. రత్నంకూడా కొద్దిగా ఒగర్చింది, గుడిచుట్టూ ప్రదక్షిణాలయ్యాయి. కోనేట్లో కాళ్లు కడుక్కొని భవానీ దర్శనం చేసుకున్నాం. అక్కడ మామయ్య ఎరిగున్న పెద్ద మనిషొకాయన 'ఎవరు'-మీ అల్లుడు కూతురా?' అని అడిగాడు.

'మీకు సందేహ మెందుకొచ్చింది ?'అన్నాడు మావయ్య 'అహ ఊరికే అడిగాను.' అన్నాడా పెద్దమనిషి. రత్నం అవేమిటి యివేమిటి అని కొండ మీంచి వూరును చూపిస్తూ ఏవో అడిగింది, అన్నిటికి సమాధానం చెప్పాను. గుళ్లో పూజారి మమ్మల్నిద్దర్నీ ఒకరి ప్రక్క నొకర్ని నిలుచోబెట్టి శఠగోపురం వుంచాడు. దుర్గాదేవి కుంకుమని మా నొసటను అలంకరింప చేశాడు. రత్నం మనస్సులో ఏదో అనుకుని నమస్కారం చేసింది. అట్లా అనుకున్న తరువాత నాకేసి చూసి నవ్వి మళ్లీ చెంప లేసుకొని అమ్మవారికి నమస్కారంచేసింది తిరిగి. కొబ్బరి కాయచెక్కను కోనేటిగట్టున రాతిమీద కూర్చుని చితక గొట్టుకుని తిన్నాం. ఆ ముక్కలను కళ్ళ కద్దుకోవాలి తినేముందు' అని నన్ను మందలించింది, దిగి వచ్చేటప్పుడు మెట్ల చివర పటపట మామయ్య చెప్పులు పలాయనం చిత్తగించాయి.

'పోనీలే నాన్నా ! మరో జత కొనుక్కుందాము' అని తండ్రిని మాట్లాడనివ్వలేదు రత్నం.

ఇంటికొచ్చాక తాళం చెవుల గుత్తి కోనేటి సోపానంపాలమీద వదలినట్లు గుర్తుకొచ్చింది. మామయ్య కాళ్ళు జారవేసాడు. 'ఇప్పుడెట్లా' అంటూ విసుక్కున్నాడు. తాళం విరగ్గొట్టారు, సినిమాకి పోదామని చెప్పి బయలుదేర దీశాను. రత్నం 'నడవలేను' అంది బద్ధకంగా,

" పో నీ ప రు గె త్తు—"అని బయలుదేర మన్నాను నవ్వి "లాభంలేదు - కాళ్ళు నొప్పులు అంది.

"ఎవరికి ?" అన్నా చవ్వున. "మనకు"అంది వెంటనే.

"నాకు లేవు నొప్పులు నేన్నడవగలను" అని మామయ్యను లేవదీసి "పద" మని ముగ్గురం హోటలుకెళ్ళి భోజనం చేసి - కిళ్లీలు నమిలి సినిమా శాలకుపోయాము,

"రేపు కృష్ణ స్నానానికి వెళ్లాలిరా-"అన్నాడు మామయ్య.

తిరిగియింటికి రావేమో అన్నానుడిగుండాలు-లోతు - ప్రవాహ వేగాన్ని జ్ఞప్తికి తెచ్చుచుంటూ. "నాకు చలివాన్న"అంది రత్నం "మరి పుణ్యం మాటో అంటున్నాడు మావయ్య. సినిమా ఆడ సాగింది కుర్చీలో రత్నానికి రెండుసార్లు కితకితలుపెట్టి దగ్గరకు లాక్కొన్నాను ఈ అత్యాచారాలు మావయ్య చేయబోయే కృష్ణ స్నాన ఫలమైన పుణ్యానికి తుడిచిపెట్టుకు పోతవనే భావనతో మూడవమారు రత్న కుడిచేతిని గిల్లబోయి చీకట్లో మామయ్య ఎడంచేతి వెంట్రుకను గట్టిగా లాగాను. "అబ్బ" యీ వెధవ కుర్చీనిండా నల్లులు అంటున్నాడు పాపం. ఇవన్నీ చీకటి తప్పులు మావయ్య సినిమాలోకంలో మనస్సు మరమ్మతు చేసుకుంటున్నాడు మీతో సినిమాకి రావటం బుద్ధి తక్కువ. అంది రత్నం వెళ్తూ.

కొన్ని రోజులకి "స్వస్తిశ్రీ చంద్రమానేన విరోధినామ సంవత్సర........"అనే శుభలేఖ వూడిపడింది ఒక శుభోదయాన!